క్లుప్తంగా

కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ



కోర్టు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: కోర్టు క్యాలెండర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, పోలీసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఐఏఎల్ (భారత న్యాయ వాదుల సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. భీమవరంలో 2024 కోర్టు క్యాలెండర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కోర్టు, ఎంగేజ్మెంట్ సెలవులు తదితర అంశాలు అందరికీ ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా కార్యదర్శి ఏలేటి న్యూటన్, సమితి సభ్యులు వైవీ ఆనంద్, ఎస్ మాణిక్యాలరావు సాగర్, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

22న శ్రీరాముని శోభాయాత్ర

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పోలీస్ క్వార్టర్స్‌లో ఉద్దరాజు వంశీయులు నిర్మించిన 64 సంవత్సరాల రామాలయం నుంచి భీమవరం ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో ఈనెల 22న శ్రీరాముల ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్టు నిర్వహణ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు తెలిపారు. రామాలయంలో స్వామివారికి ధూపదీప నైవేధ్యాలతో పూజలు ఉద్దరాజు వంశీయులే నిర్వహిస్తున్నారని చెప్పారు. ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ శోభాయాత్ర అనంతరం ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్లో స్వామివారి కల్యాణం, ఆంజనేయ స్వామి తమలపాకుల అర్చన, భజన కోలాటం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్దరాజు కుటుంబ సభ్యులు పోలీసు సిబ్బంది, పిప్పళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ ఈవీఎం మెషీన్లపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఓటు హక్కు వినియోగంపై స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో రెవెన్యూ శాఖ, విజ్ఞాన వేదిక అధ్వర్యంలో డమ్మి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లు ఉంటాయన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన వారితో పాటు 17 ఏళ్ల వయస్సు గల వారూ ప్రోగ్రెసివ్ ఓటర్లుగా నమోదు కావచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, హరిగోపాల్, ఆర్టీసి సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనతో ప్రజలకు మేలు



పెదపుల్లేరులో కులగణన నిర్వహిస్తున్న అధికారులు

ఉండి: కులగణన వల్ల ప్రజలకెంతో ఉపయోగకరమని ఎంపీడీఓ ఎస్ రవీంద్ర అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన కులగణన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కులగణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కులగణన ద్వారా బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వం నుంచి సంక్షేమం పూర్తిస్థాయిలో అందించేందుకు వీలవుతుందని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక యాప్‌లో ప్రజలు తెలిపే వివరాలు నమోదవుతాయని చెప్పారు. ప్రజల డేటా భద్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, ఏఎస్‌ఓ శేషురామరావు, ఎంఈఓ-2 బి.వినాయకుడు, వీఆర్వోలు, సచివాలయ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అప్రోచ్‌లకు చురుగ్గా టెండర్లు

- ప్రభుత్వ విప్ శ్రీనివాస్ కృషితో రూ.36 కోట్ల విడుదల
- యనమదుర్రు వంతెనలకు త్వరలో మోక్షం



అప్రోచ్ రోడ్డు నిర్మించనున్న భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనల్లో ఒకటి



అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిజైన్

భీమవరం(ప్రకాశం చౌక్): తీరప్రాంత గ్రామాల ప్రజల కల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషితో త్వరలో సాకారం కానుంది. యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్‌ల (రిటైనింగ్ వాల్స్, జంక్షన్ పాయింట్స్, సర్వీసు రోడ్లు) నిర్మాణానికి ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ కృషితో ప్రభుత్వం రూ.36 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈనెల 12 తేదీ నుంచి ప్రారంభమైన టెండర్ల ప్రక్రియ వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రకియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టేందుకు యంత్రంగం చర్యలు చేపట్టింది.

శాశ్వత సమస్యకు త్వరలో పరిష్కారం

2004 నుంచి 2009 వరకు మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన గ్రంధి శ్రీనివాస్ నాడు తీర ప్రాంత ప్రజల సౌకార్యార్థం డెల్టా ఆధునికీకరణలో భాగంగా నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సహకరంతో యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం చేపల మార్కెట్, గొల్లవానితిప్ప, తోకతిప్ప ప్రాంతాల్లో మూడు వంతెనలు నిర్మించారు. అనంతరం పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ ఈ వంతెనలకు అప్రోచ్‌లు నిర్మించలేకపోయారు. దీంతో పదేళ్లకు పైనే వంతెలను నిరుపయోగంగా ఉన్నాయి. 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ వంతెనల అప్రోచ్‌ల నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తొలుత ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.15.30 కోట్లు మంజూరు చేయించారు. నాటి డిజైన్లను పరిశీలించి, శాశ్వత ప్రాతిపదికన అప్రోచ్‌ల నిర్మాణానికి సిద్ధమవుతున్న తరుణంలో డిజైన్లను మార్చి అప్రోచ్స్ నిర్మిస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే శ్రీనివాస్ భావించారు. కొత్త డిజైన్లతో అప్రోచ్‌లు నిర్మించాలని మరోసారి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.36 కోట్లు మంజూరు చేయించారు. నాడు వంతెనలు నిర్మించి, నేడు అప్రోచ్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టిన గ్రంధి శ్రీనివాస్‌ను ప్రజలతోపాటు ప్రతిపక్ష పార్టీలు కూడా అభినందిస్తున్నాయి.

డిజైన్ల ఖరారు

యనమదుర్రు డ్రెయిన్‌పై మూడు వంతెనల అప్రోచ్‌ల కోసం ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలన చేసి పంపించిన డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో అప్రోచ్‌ల పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు గ్రంధి శ్రీనివాస్‌కు, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సీఎం జగన్ సహకారం మరువలేనిది



యనమదుర్రు డ్రెయిన్‌పై మూడు వంతెనల అప్రోచ్‌ల నిర్మాణానికి పలుమార్లు నిధుల మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిది. కొత్త డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేయడం, రూ.36 కోట్లు నిధులు మంజూరు చేయడంతో వంతెనల అప్రోచ్‌ల నిర్మాణం సులభతరం అయ్యింది. వేగంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలు చేపడతాం. వంతెల వద్ద ఉన్న ఆలయాలకు ఇబ్బంది లేకుండా అప్రోచ్‌ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ వంతెనలు వినియోగంలోకి వస్తే భీమవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్య కూడా తీరనుంది. తీర ప్రాంతాల నుంచి పలు రకాల ఉత్పత్తుల రవాణాకు సులభమవుతుంది. ఈ వంతెనలను వినియోగంలోకి తీసుకురావడానికి చేసిన కృషికి ఫలిస్తోంది.

– గ్రంధి శ్రీనివాస్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం

కాళ్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పేర్కొన్నారు. అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విజయవాడ బయలుదేరిన పార్టీ శ్రేణుల బసును పీవీఎల్ నరసింహరాజు శుక్రవారం కాళ్ల మండలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు ఈ రోజు పండగ లాంటిదన్నారు. విజయవాడ నడిబొడ్డులో సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటుకు సీఎం జగన్ సంకల్పించారని, ఇది దేశానికే తలమానికంగా నిలుస్తుందని చెప్పారు. ఉండి నియోజకవర్గం నుంచి 12 బస్సుల్లో పార్టీ శ్రేణులు విజయవాడ తరలివెళుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.



కాళ్ల : అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు బయలుదేరిన నాయకులు



భీమవరం అర్బన్ : లోసరి వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న విజయ నరసింహరాజు

విజయవాడ తరలిన నాయకులు

ఆకివీడు : భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ ఓ చరిత్రని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) అన్నారు. విజయవాడలో శుక్రవారం ప్రారంభిస్తున్న కాంస్య విగ్రహావిష్కరణకు ఉండి నియోజకవర్గం నుంచి బస్సులు, కార్లలో 700 మంది అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ బస్సులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సెంటర్‌లో జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సీఎం జగన్ రాష్ట్ర సంక్షేమానికి, అభివృద్ధికి చేస్తోన్న కృషికి ప్రజలు సహకరించాలని కోరారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి అభిమానులు తరలి వెళ్లేందుకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పూర్తి సహకారం అందించారని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి అంబటి రమేష్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, సర్పంచ్‌లు నందమూరి ప్రకాశం, చిట్టిబాబు, కొట్టు మాణిక్యాలరావు, కురెళ్ల పోలు, షడ్రక్, కఠారి కేశవరావు, మందలంక జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిన అభిమానులు

భీమవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్ప ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొనడానికి బయలుదేరిన చలో విజయవాడ కార్యక్రమాన్ని రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు అభినందనీయమన్నారు. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వీరయ్య, ఎస్ విజయ కుమార్ మాట్లాడుతూ భారత దేశానికి చిరస్మరణీయ సేవలందించి, కోట్లాది మంది భారతీయుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజబాబు, కోశాధికారి ఎంపీఎస్ ప్రసాద్, సభ్యులు కె.శ్రీనివాసరావు, కె.సోమయ్య, ఎం.రామకృష్ణ, కె.నాగరాజు, వి.సువర్ణరాజు, కె.వెంకట్రావు, కె.ఆసిబాబు, బి.యేసు బాబు, పి.శ్రీనివాసరావు, జి.మెషక్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో జగనన్న పాలన

భీమవరం అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. భీమవరం మండలం లోసరి గ్రామంలో విజయవాడలో జరిగే సామాజిక న్యాయ మహాశిల్పం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి వేళ్లే బస్సులు, కార్లను శుక్రవారం పేరిచర్ల విజయ నరసింహరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పేరిచర్ల, కోటిపల్లిలు మాట్లాడుతూ అంబేడ్కర్ అన్ని వర్గాల వారినీ దృష్టిలో పెట్టుకుని రచించిన రాజ్యాంగాన్ని నేటికి అనుసరిస్తూనే ఉన్నామని చెప్పారు. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహావిష్కరణ దేశానికే తలమానికంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, పెనుమాల నరసింహస్వామి, తిరుమల విజయరామ్, బద్దా శాంతారామ్, బుంగా ప్రహ్లాదుడు, గూడపాటి పెద్దిరాజు, ఇంజేటి ప్రభాకర్‌రావు, బత్తుల ఏలీషా, రేవుల గడ్డ రాజ్ కుమార్, బేతాల సంతోష్, సంధి యోహాన్, మద్దా రాజారత్నం, డేనియేల్, మద్దా పిలిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల వారికి గుర్తింపే లక్ష్యం

ఉండి: స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టీస్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఉండి మండలంలోని 21 సచివాలయాల నుంచి విజయవాడ తరలివెళ్లారు. శుక్రవారం ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మూడు ఆర్టీసీ బస్సులు, 20 కార్లలో ఎస్సీ నాయకులు, అంబేడ్కర్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సీ నాయకులు మాట్లాడుతూ రాజకీయాల కోసం కాకుండా వెనుకబడిన వారికి తగిన గుర్తింపు ఇవ్వాలనేదే సీఎం జగన్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, కమతం బెనర్జి, మండల లీగల్‌సెల్ అధ్యక్షుడు జి.సుందర్ కుమార్, వెలగపల్లి టోని, బండి మధు, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డు నాగన్న, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, మోతూషేల, కోనాల సుదర్శనం, గోరింకల యేసేబు తదితరులు పాల్గొన్నారు.



భీమవరం : చలో విజయవాడ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మేడిది జాన్సన్



ఉండి : విజయవాడకు బస్సులో బయలేదురుతున్న ఎస్సీ నాయకులు



ఆకివీడు : ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన అభిమానుల బస్సులు

ప్రాతళ్లమెరకలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కాళ్ల: రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ప్రాతళ్లమెరక గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. తుపాన్లు, వర్షాల వల్ల రోడ్ల అభివృద్ధి ఆలస్యమైందన్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల రహదారుల నిర్మాణం చేపట్టినట్టు చెప్పారు. ప్రాతళ్లమెరక గ్రామ పరిధిలో సీఎంఓ నిధులు రూ.40 లక్షలతో 175 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేగేశ్న బాలగణపతి వర్మ, సాగిరాజు హరివర్మ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకున్న సీఎం జగన్, ఇన్‌చార్జి మంత్రి దాడిశెట్టి రాజా, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, వేగేశ్న బాల గణపతి వర్మ, సాగిరాజు హరి వర్మ, కంతేటి సుబ్బరాజు, దంతులూరి కోటేశ్వరరాజు, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస యాదవ్, ఏఈ శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల : ప్రాతళ్లమెరకలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన పీవీఎల్

బైపాస్ రోడ్డుకు మరమ్మతులు

ఆకివీడు : స్థానిక బైపాస్ రోడ్డుకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆర్థిక సాయంతో మరమ్మతులను శుక్రవారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, దివంగత పాతపాటి సర్రాజు హయాంలో తారుతో బైపాస్ రోడ్డు నిర్మించారు. అనంతరం ఆ రోడ్డును పట్టించుకున్న పాలకులు లేరు. ఫలితంగా బైపాస్ రోడ్డుపై పలుచోట్ల భారీ గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పీవీఎల్ తన సొంత సొమ్ముతో స్థానిక ఫుట్‌పాత్ వంతెన నుంచి వెంకయ్య వయ్యేరు వంతెన వరకు సుమారు అర కిలోమీటరు మేర పూర్తిగా పాడైన రోడ్డును లెవెల్ చేయిస్తున్నారు. ఆక్రమణల్ని తొలగించి రోడ్డు వెడల్పు చేయిస్తున్నారు. స్థానిక సబ్ స్టేషన్ వద్ద నుంచి ఫుట్‌పాత్ వంతెన వరకు రిటర్నింగ్ వాల్, రోడ్డు మధ్య ప్రదేశంలో ఉన్న పిచ్చి మొక్కల్ని, వ్యర్థాల్ని తొలగిస్తున్నారు. ఈ పనులను త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, ఆయా వార్డు నాయకులు, ఆర్అండ్‌బీ జేఈ శ్రీహరి శుక్రవారం పర్యవేక్షించారు.



ఆకివీడు : స్థానిక బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

'ఆడుదాం ఆంధ్ర' ఖోఖో పోటీలు ప్రారంభం



ఉండిలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఉండి: ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో క్రీడాకారులు హుషారుగా పాల్గొంటున్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఖోఖో మొదటి రౌండ్ నాకౌట్ పోటీలను గేమ్స్ మండల ఇన్‌చార్జి జీవీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 21 సచివాలయాల నుంచి 10 మహిళలు, పురుషుల ఖోఖో జట్లు పోటీపడ్డాయి. శనివారం క్వార్టర్, సెమీ ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామని కృష్ణంరాజు తెలిపారు. పోటీలను పీడీలు అరుణకుమారి, స్వామి, కె.అరుణకుమారి, పీఈటీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

యూపీఏ అధ్యక్షుడిగా ప్రభాకర్



ప్రభాకర్‌ను అభినందిస్తున్న ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్

భీమవరం(ప్రకాశం చౌక్): ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ ఆధ్వర్యంలో స్థానిక చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఆవరణంలో భీమవరం యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ 2024 సంవత్సర కార్యవర్గం ఏర్పడింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా పాస్టర్ ఆర్ ప్రభాకర్ (జేసీపీఎం చర్చ్ ఫౌండర్, ప్రెసిడెంట్ భీమవరం) నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి మేడిది జాన్సన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెస్ట్ గోదావరి పాస్టర్స్ ఫెలోషిప్ నుంచి ప్రేమ్ కుమార్, రత్నంరాజు

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరికీ వరం



చెరుకువాడలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ సాంబశివరావు, నాయకులు

ఉండి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు ప్రజలకు ఒక వరం లాంటిదని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, ఎంపీడీఓ ఎస్ రవీంద్ర అన్నారు. శుక్రవారం చెరుకువాడలో నిర్వహించిన రెండో దశ జగనన్న ఆరోగ్యసురక్ష హెల్త్ క్యాంపును సర్పంచ్ సాంబశివరావు ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య ఖర్చు పరిధిని రూ.25 లక్షలకు పెంచి రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని మరింత క్షేమంగా కాపాడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కొడలరావు, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డు నాగన్న, వార్డు సభ్యుడు బిల్‌మోరియా, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ఆకివీడు : మండలంలోని పెదకాపవరం శివారు గొల్లగూడెంలో గురువారం రాత్రి నల్లపల్ల శ్రీనివాసరావుపై పాతకక్షల నేపథ్యంలో కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఎస్సై నాగబాబు శుక్రవారం తెలిపారు. గంగుల సుబ్బారావు, సాయి ప్రకాష్, రామకృష్ణ, మరో ముగ్గురు తనపై దాడి చేసినట్టు ఆసుపత్రి నుంచి బాధితుడు ఫిర్యాదు ఇచ్చినట్టు పేర్కొన్నారు.